రెండు రోజుల్లో పత్తి కొనుగోలు కేంద్రం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి- సాలూరు

స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని రెండు రోజుల్లో ప్రారంభించనున్నట్లు జిల్లా అగ్రి ట్రేడ్, మార్కెటింగ్ అధికారి ఐ.గంగాధరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ప్రజాశక్తిలో తెల్ల బంగారం ధర పతనం శీర్షికతో వచ్చిన కథనానికి ఆయన స్పందిస్తూ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పత్తి పండించిన రైతులంతా సాలూరు మార్కెట్ యార్డులో వున్న కొనుగోలు కేంద్రానికి పత్తి తరలించి విక్రయించాలని ఆయన ప్రకటనలో కోరారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో విజయగౌరి

- విద్యార్థి దశ నుంచే విద్యారంగ సమస్యలపై పోరాటం
- పాఠశాలల మూసివేత, అక్రమ బదిలీలపై అలుపెరుగని ఉద్యమాలు
- యుటిఎఫ్ మండల కార్యదర్శి నుంచి రాష్ట్ర స్థాయి నేతగా ఎదుగుదల

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

యుటిఎఫ్ (ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరెడ్ల విజయగౌరి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచారు. ఈ మేరకు విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఆమెను అభ్యర్థిగా ప్రకటించారు. వివిధ సంఘాలు ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరిచ్చాయి. విజయగౌరి విద్యార్థి దశ నుంచే విద్యారంగ సమస్యలపై పోరాటం చేశారు. యుటిఎఫ్ సాధారణ కార్యకర్తగా చేరిన ఆమె అనతి కాలంలోనే జిల్లా, రాష్ట్ర నాయకురాలిగా ఎదిగారు. రేషనలైజేషన్ పేరిట పాఠశాలల కుదింపు, క్లస్టర్ పాఠశాలల విధానం వంటివాటిపై ఉద్యమాలు ముందుకు నడిపేందుకు చొరవ చూపారు. జిఓ నెంబర్ 72కి వ్యతిరేకంగా చేపట్టిన పోరాటంలో పోలీసులు అక్రమ కేసు బనాయించినా వెరవలేదు. 2017లో అక్రమ బదిలీలపై జరిగిన ఉపాధ్యాయుల ఆందోళన కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయ నేతగా నాయకత్వం వహించారు. అప్పట్లో పెట్టిన కేసు ఏడేళ్లపాటు నడిచింది. పేదలను విద్య నుంచి దూరం చేసే నూతన విద్యావిధానంపై జరిగిన పోరాటంలోనూ ఎంతో చురుకుగా పనిచేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్బంధాలు, బెదిరింపులు, కేసులు ఎదుర్కొన్నారు. 1996 నుంచి బొబ్బిలి ప్రాంతంలో యుటిఎఫ్ విస్తరణకు కృషి చేశారు. యుటిఎఫ్ బొబ్బిలి మండల తొలి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఆమె, అనంతరం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, రాష్ట్ర సహాధ్యక్షులుగా, ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శిగా పనిచేస్తూ యుటిఎఫ్ ఉద్యమాల్లోనూ, వివిధ ఉపాధ్యాయ సంఘాలను ఐక్యం చేయడంలోనూ కీలకపాత్ర పాత్ర పోషించారు. ప్రస్తుతం యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా చురుకైన పాత్రపోషిస్తున్నారు. మరోవైపు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఉపాధ్యక్షురాలిగా కూడా సేవలందిస్తున్నారు.

సిపిఎస్ రద్దు ఉద్యమంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు విజయగౌరి (ఫైల్)

విద్యార్థి దశ నుంచే ప్రగతిశీల భావాలు

విజయగౌరి చిన్ననాటి నుంచే ప్రగతిశీల భావాలు గలవారు. ఆమె అన్నయ్య తిరుపతిరావు ప్రోత్సాహంతో హైస్కూల్‌లో చదువుతుండగానే ఎస్ఎఫ్‌లో చేరారు. అప్పటికే విద్యార్థులు, విద్యారంగ సమస్యలపై పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు భవాని వెంట వెళ్లేవారు. అలా మొదలైన ఆమెలో నాయకత్వ లక్షణాలు చదువు పూర్తయ్యేవరకు ఎస్ఎఫ్ఎఫ్ నాయకురాలిగా కొనసాగేలా చేశాయి. కాలేజీ స్థాయి నుంచి ఎస్ఎఫ్ఐలో క్రియాశీలక కార్యకర్తగా, చురుకైన నాయకురాలిగా పనిచేశారు. ఉపాధ్యాయ వృతిలో చేరాక భారత జ్ఞాన విజ్ఞాన సమితి వేదికలో 1992 నుంచి 1995 వరకు వందలాది గ్రామాల్లో అక్షరాస్యతా శాతం పెంపునకు కృషి చేశారు. ఆ తరువాత జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగాను, అక్షరాస్యత ఆవశ్యకత గురించి కొన్ని గ్రామాల్లో మూడు నెలలపాటు 20మంది యువతులతో ప్రచారోద్యమం చేపట్టారు. మరోవైపు సమతా కళాజాత నిర్వహణ కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తూ 1994 నుంచి 1996 వరకు సారా వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ తరువాత జన విజ్ఞాన వేదిక ఏర్పాటు, సైన్స్ ఉద్యమాన్ని బొబ్బిలి ప్రాంతంలో కీలకంగా నడిపారు. ఈ క్రమంలో 72 గిరిజన గ్రామాల్లో పర్యటించి, గిరిజన స్థితిగతులు, ఆ ప్రాంతంలోని విద్యారంగ సమస్యలపై అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి ఎనలేని కృషిచేశారు. ఆ ఉద్యమ ఫలితంగా జిల్లాలో మూతపడిన 12 ప్రభుత్వ పాఠశాలలను తిరిగి తెరవడంతోపాటు కొత్తగా మూడు పాఠశాలలు ఏర్పాటయ్యాయి.

ఇదీ కుటుంబ నేపథ్యం..

విజయగౌరి తండ్రి సంజీవ్ నాయుడు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఈ ప్రభావం కుటుంబంపై ఉండడంతో అన్నదమ్ములు, అక్కచెల్లెలు అంతా ఉన్నత చదువులు అభ్యసించిన వారే. అంతకు మించి ప్రగతిశీల భావాలు గలవారు. విజయగౌరి భర్త సత్యంనాయుడు కూడా ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. సుదీర్ఘకాలంగా జనవిజ్ఞాన వేదికలో పని చేస్తున్నారు. సోదరుడు కీర్తిశేషులు కె.శేషగిరి ఉమ్మడి విజయనగరం జిల్లాలో అన్ని ఉపాధ్యాయ సంఘాలనూ ఏకతాటిపైకి తీసుకొచ్చి విద్యారంగ సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేసిన విషయం తెలిసిందే. మరో సోదరుడు తిరుపతిరావు కూడా అభ్యుదయ భావాలు గల వ్యక్తి. ఇంజినీరుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. చెల్లెలు రమాప్రభ సామాజిక కార్యకర్తగా పనిచేస్తూ పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. విశాఖ కేంద్రంగా చిల్డ్రన్స్ క్లబ్ నడుపుతున్నారు. ఇలా కుటుంబ సభ్యులంతా అందరికీ అదర్శంగా నిలుస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై టిడిపి వ్యూహాత్మక మౌనం

- గడువు సమీపిస్తున్నా నోరు మెదపని అగ్రనేతలు
- అభ్యర్థి ఎంపిక పై వైసిపి తర్జనభర్జనలు
- అధికారపార్టీ స్పందన కోసం ఎదురు చూపులు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలపై అధికారపార్టీకి చెందిన జిల్లా మంత్రులు, ముఖ్యనాయకులు వ్యూహాత్మక మౌనం వహిస్తున్నారు. అనువుగాని చోట అధికులమనరాదన్నట్లు టిడిపి నేతలు ఆచితూచి అడుగులేస్తున్నారు. అధికారంలో ఉన్నా స్థానిక సంస్థల ఓట్ల విషయంలో ప్రతిపక్ష పార్టీ బలానికి దరిదాపుల్లో కూడా లేకపోవడంతో టిడిపి నాయకులు మౌనం వహిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఒకవైపు గెలుపు కోసం పూర్తి స్థాయిలో ఆధిక్యత కనిపిస్తుండడంతో జిల్లా వైసిపి నేతలు అభ్యర్థి ఎంపికపై తీవ్ర సమాలోచనల్లో ఉన్నారు. ఇప్పటికే విధానమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ విశాఖపట్నంలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులతో మంతనాలు జరిపారు. మాజీ మంత్రులు పుష్పశ్రీవాణి, రాజన్నదొరతో పాటు మాజీ ఎమ్మెల్యేలు శంబంగి వెంకటచిన అప్పలనాయుడు, బడుకొండ అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, కోలగట్ల వీరభద్రస్వామి, బొత్స అప్పలనరసయ్య బొత్సతో భేటీకి హాజరయ్యారు. ఒకవేళ పోటీ జరిగితే వైసిపి అభ్యర్థి ఎవరైనా భరించాల్సిన ఖర్చులు, అవసరమైన ఆర్థిక వనరుల గురించి బొత్స సత్యనారాయణ ఉమ్మడి జిల్లా కీలక నేతలకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. అధిష్టానం ఎవర్ని అభ్యర్థిగా ఖరారు చేసినా కనీసం రూ.5కోట్లు ఖర్చు పెట్టేందుకు సిద్ధం కావాలని సూచనప్రాయంగా సంకేతాలు అందాయనే ప్రచారం జరుగుతోంది. దీంతో రెండేళ్ల ఎమ్మెల్సీ పదవి కోసం ఇంత డబ్బు పెట్టి పోటీ చేయడం అవసరమా అని కొందరు మాజీ ఎమ్మెల్యేలు ఆసక్తి కనబర్చడంలేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే అధిష్టానం అభ్యర్థిగా ఎంపిక చేస్తే అప్పుడు ఆలోచించవచ్చునని ఆ నాయకులు ఆచితూచి అడుగులేస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన రెండు డివిజన్లలో విజయనగరం డివిజన్ నుంచి విధానం మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కీలకమైన పదవుల్లో వున్నారు. ఇప్పుడున్న ఎమ్మెల్సీ స్థానంలోనూ అదే డివిజన్‌కు చెందిన నాయకులకు ప్రాధాన్యత ఇస్తే ప్రాంతీయ, సామాజిక సమతుల్యతలను దెబ్బ తీసినట్లవుతుందనే అభిప్రాయం వైసిపి శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పార్వతీపురం డివిజన్ లేదా మన్యం జిల్లాకు బిసి, ఎస్‌టి సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే వాదనలు తెరపైకి వస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పేరు తెరపైకి వస్తోంది. ఎస్టీల్లో మాజీ మంత్రి పుష్ప శ్రీవాణి ఆసక్తి కనబరుస్తున్నా మాజీ మంత్రి రాజన్నదొర మాత్రం పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. అయితే సాలూరు నియోజకవర్గంలో మక్కువ మండలానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు మావుడి సోదరులు గతంలో ఎమ్మెల్సీ కావాలని ప్రయత్నించారు. వైసిపి అగ్రనేతల దృష్టికి వారి ఆకాంక్షను తీసుకెళ్లారు. అయితే అప్పట్లో సాధ్యం కాకపోయినా ఇప్పుడు అవకాశం కళ్లముందు కనిపిస్తోంది. అయితే వారి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడానికి సామాజిక కోణం అడ్డంకిగా మారుతోంది. ఈ నేపథ్యంలో మరో బిసి, గిరిజన సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని అభ్యర్థిగా ప్రకటించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. నామినేషన్ దాఖలు చేయడానికి గడువు సమీపిస్తుండడంతో రెండు, మూడు రోజుల్లో వైసిపి నాయకత్వం అభ్యర్థిపై నెలకొన్న ఉత్కంఠకు తెర దింపే అవకాశం ఉంది.

ఎమ్మెల్సీ ఎన్నికలపై నేడు జగన్ సమీక్ష

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, అభ్యర్థి ఎంపికపై వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి బుధవారం ఉమ్మడి జిల్లా నాయకులతో భేటీ కానున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యే లందరినీ విజయవాడ రావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే విధాన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ విశాఖపట్నంలో ఉమ్మడి జిల్లా నాయకులతో ఒకసారి సమీక్ష నిర్వహించారు. జగన్‌తో భేటీకి జిల్లాలో వున్న మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు బయలుదేరి వెళుతున్నారు. బుధవారం జగన్‌తో జరిగే సమావేశంలో అభ్యర్థి ఎవరనే దానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ప్రాథమిక రంగాల ద్వారా ఇచ్చే ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్య శాఖలకు సంబంధించిన పథకాలు గిరిజనులకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. డిసెంబర్ నాటికి నిధులు ఖర్చు చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి అవసరమయ్యే వారికి మాత్రమే పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్దిదారుల్లో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మత్స్య శాఖ పథకాలు ఆ సొసైటీలకు అందేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఎస్.మన్మధరావు, జిల్లా మత్స్య శాఖ అధికారి తిరుపతయ్య, మత్స్య శాఖ ఎడి సంతోష్, పిహెచ్ఒ గణేష్, వెలుగు ఎపిడి సన్యాసిరావు, పశు సంవర్ధక శాఖ ఎడి శ్రీనివాస రావు, ఎఫ్‌డిఒ గోపీకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అన్నింటా ముందంజలో ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ఎస్‌టిపి (సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్), డంపింగ్ యార్డు, తడి-పొడి చెత్త సేకరణ, పారిశుద్ధ్యం, రహదారులు, తాగునీరు వంటి ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపాలిటీల అభివృద్ధిపై సంబంధిత కమిషనర్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మున్సిపాల్టీలో పచ్చదనం, పారిశుద్ధ్యం, మొక్కలను నాటడం, రహదారులు, పార్కులను అభివృద్ధి చేయడం వంటివి చేపట్టాలన్నారు. అన్ని అంశాల్లో మన మున్సిపాల్టీలు ముందంజలో ఉండాలని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతి మున్సిపాల్టీకి అదనపు ఆదాయం సమకూరేలా కొత్త ఆలోచనలతో ముందుకు రావాలని తెలిపారు. మరుగుదొడ్లు లేని ప్రాంతాల్లో సామాజిక మరుగుదొడ్లు నిర్మించాలని, వాటి నిర్వహణ ఖర్చులు వారే సమకూర్చుకొనేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైల్వే, బస్ స్టేషన్లు, ముఖ్య కూడళ్లను గుర్తించి, అటువంటి చోట్ల ఏర్పాటు చేయాలని తెలిపారు. రహదారి భద్రతలో భాగంగా అన్ని మున్సిపాల్టీల పరిధిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, జన సందోహం ఉన్నచోట్ల సిగ్నల్ లైట్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో గుంతలు లేని రహదారులకు ప్రాధాన్యతను ఇవ్వాలని, ఎక్కడా గుంతలు లేకుండా రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా తాగునీటి సమస్య ఎక్కడా తలెత్తరాదని, అటువంటి పరిస్థితులు భవిష్యత్తులో తలెత్తకుండా ఉండేందుకు ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి మున్సిపాల్టీల్లో పారిశుద్ధ్యం లోపించరాదని డంపింగ్ యార్డు, బరెల గ్రౌండ్ సమస్య లేకుండా ప్రణాళికలు చేయాలని, తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్త నుంచి సంపదను సృష్టించే మార్గాలను అన్వేషించాలని పేర్కొన్నారు. సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లను అన్ని మునిసిపాలిటీల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. మున్సిపాల్టీ పరిధిలో నిర్మితమవుతున్న గృహాలను పరిశీలించి అవి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పిఎం సూర్య ఘర్‌తో లబ్దిదారులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని, వీటిని ఆయా మున్సిపాల్టీ పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించి, సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. దీని ద్వారా లబ్దిదారునికి అదనపు ఆదాయం కూడా సమకూరుతుందని కలెక్టర్ వివరించారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ అశుతోశ్ శ్రీవాస్తవ, పార్వతీపురం, సాలూరు. పాలకొండ మునిసిపాలిటీల కమిషనర్లు, ఇంజినీరింగ్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

బడి దేవరకొండపై నేడు పాదయాత్ర

ప్రజాక్తి - పార్వతీపురం

మండలంలోని బడిదేవరకొండపై గ్రానైట్ తవ్వకాలకు లైసెన్స్ రద్దు చేయాలని కోరుతూ బుధవారం పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన పాదయాత్ర ప్రారంభం కానుంది. ఉదయం 10గంటలకు స్థానిక పాత బస్టాండ్ నుంచి పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు కమిటీ సభ్యులు రంజిత్ కుమార్ చెప్పారు. బడిదేవరకొండ గ్రానైట్ తవ్వకాల వల్ల ప్రభావితమయ్యే గ్రామాల్లో పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోడ అమల్లో ఉన్నందున పాదయాత్రకు పోలీసులు అనుమతులు ఇవ్వలేదు. పాదయాత్ర చేయొద్దంటూ ముందస్తుగా పరిరక్షణ కమిటీ నాయకులకు పోలీసులు నోటీసులు మంగళవారం అందజేశారు.

సిఎంను కలిసిన ఎమ్మెల్యే విజయచంద్ర

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను మంగళవారం, రాజధాని అమరావతిలో స్థానిక ఎమ్మెల్యే బోనాల విజయ్ చంద్ర కలిశారు. రాష్ట్రానికి చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలతో కలిసి సమావేశమ య్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిస్థితి , పథకాల అమలు తదితర అంశాలు ముఖ్యమంత్రి వివరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎస్సీ, ఎస్టీ , బీసీలకు ఉపయుక్తంగా ఉండేలా ఇండస్ట్రియల్ పాలసీ తీసుకురావాలని ముఖ్యమంత్రి ని కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కొండ్రుమురళి, రామాంజనేయులు, తెనాలి శ్రావణ్, రాజకుమార్, కుమార్ రాజా, కే శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఎస్‌సి ఎమ్మెల్యే

జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు వివరాలు అందించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన, పాల్గొన్న క్రీడాకారులు తమ వివరాలను అందించాలని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో తీసుకురానున్న నూతన క్రీడా పాలసీ ప్రకారం, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాప్) జిల్లాలో ఉన్న జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన, పాల్గొన్న క్రీడాకారులు వివరాలు, జాతీయ ఖేలో ఇండియా స్థాయిలో పాల్గొన్న క్రీడాకారుల వివరాలు కోరారని తెలిపారు. ఇందులో భాగంగా ఆయా స్థాయిల్లో పాల్గొన్న క్రీడాకారులు తమ వివరాలను ఈనెల 6లోగా పార్వతీపురం మన్యం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థకు అందజేయాలని ఆయన కోరారు. వివరాలకు 9701648344ను సంప్రదించాలని ఆయన సూచించారు.

మక్కువ పిహెచ్‌సి వద్ద నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

ఆశా, సిహెచ్‌డబ్ల్యుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - మక్కువ/సాలూరురూరల్

ఆశా వర్కర్ల సమస్యలపై పభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందాలకు జీవోలు విడుదల చేయాలని, అలాగే కమ్యూనిటీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు వి.ఇందిర, కోరాడ ఈశ్వరరావు నాయకత్వంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు మక్కువ, సాలూరు మండలం మామిడిపల్లి, తోణాం, బాగువలస పిహెచ్‌సిల ఆందోళన చేసి, అనంతరం వైద్యాధికారులకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎపి ఆశా వర్కర్స్ యూనియన్‌తో ఆశా వర్కర్ల సమస్యలపై చర్చలు జరిపిందన్నారు. ఈ చర్చల్లో 60 నుంచి 62ఏళ్ల వరకు ఆశాల సర్వీసు పెంచుతామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేస్తామని, ప్రమాదవశాత్తు మరణించిన వారికి బీమా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చినా నేటికీ ఇచ్చిన మినిట్స్‌ను జీవోగా ఇవ్వలేదని అన్నారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు రాష్ట్రంలో 2361 మంది గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్నారని, వీరందర్నీ ఆశాలుగా గుర్తించి, వారితో సమానంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రయాణం ఖర్చులు రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్, గిరిజన ప్రాంతాల్లో ఎఎన్ఎం శిక్షణ పొందిన ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ఎఎన్ఎంలుగా ప్రమోషన్ ఇవ్వాలని, గౌరవ వేతనాన్ని డైరెక్టరేట్ నుంచి ఆశాల ఖాతాల్లోకి చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రాజేశ్వరి, శ్రీదేవి, ఆదిలక్ష్మి ,రమణమ్మ, మరియమ్మ , సిహెచ్ డబ్ల్యూ నాయకులు రమణమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

ఏజెన్సీ రహదార్లు నరకానికి నకళ్లు

పాలకులు మారినా పరిష్కారం కాని సమస్యలు

ప్రజాశక్తి - సీతంపేట

ప్రభుత్వాలు మారినా గిరిజన సమస్యలు పరిష్కారం కావడం లేదు. స్వాతంత్రం వచ్చి 75ఏళ్లయినా గడుస్తున్నా నేటి గిరిజన తండాల్లో కనీస వసతుల్లేక గిరిజనులు అల్లాడిపోతున్నారు. కనీసం రహదారి, తాగునీరు, గృహాలు లేకపోవడంతో గిరిజన అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలు అక్కడే చందంగా మారింది. గిరిజన గ్రామాల్లో రహదారుల్లేవని, దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నామని పలుమార్లు వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టినా, గ్రీవెన్స్‌లో వినతలు సమర్పించినా ప్రయోజనం కనిపించ లేదు.

సీతంపేట ఐటిడిఎ పరిధిలో 20 సబ్ ప్లాన్ మండలాల పరిధిలోని 1200 గిరిజన గ్రామాలు ఉన్నాయి. సుమారు రెండు లక్షల మంది గిరిజనులు నివసిస్తున్నారు. సుమారు 100 గ్రామాలకు రోడ్లు లేవు. అధికారులు లెక్కలు ప్రకారం 70 రోడ్లు లేనట్లుగా గుర్తించినట్లు తెలుస్తుంది.

రాళ్లు తేలిన రంగం వలస వెళ్లే రహదారి దుస్థితి

రహదారుల్లేకపోవడం కనీసం నడవలేని పరిస్థితి నెలకొంది. అత్యవసర సమయంలో అంబులెన్స్, అగ్నిమాపక శకటం, ప్రజా పంపిణీ వాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మండలంలోని మర్రిపాడు పంచాయతీలో ఎగువద్వార బంధం, నడిమిద్వార బంధం, దిగువ ద్వారా బంధం ఎత్తయిన కొండలపై ఈ గ్రామాలున్నాయి. ఈ గ్రామస్తులు రాళ్లు తేలిన రహదారిపై నడవలేని పరిస్థితి నెలకొంది. రంగంవలస రహదారి రాళ్లు తేలడంతో చుట్టుపక్కల రాళ్లపై డొంకలో కమ్మేయడంతో కనుచూపుమేర గ్రామానికి వెళ్లడానికి దారే కనిపించని దుస్థితి నెలకొంది. పెద్దగూడ, మూలగూడ, గుడిగుడ్డి, ఉసిరికపాడు వెళ్లే రోడ్లయితే ఇక చెప్పనవసరం లేదు. కిట్టలపాడు జంక్షన్ నుంచి కడగండి వరకు రహదారి పూర్తిగా మరమ్మతులకు గురి కావడంతో చుట్టుపక్కల 50 గ్రామాల వరకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి నిర్మాణం చేపడితే సీతంపేట, హిరమండలం, కొత్తూరు, సరుబుజ్జిలి, లక్ష్మీనర్సుపేట, ఐదు మండలాల వరకు ప్రయోజనం చేకూరుతుంది. మర్రిపాడు నుంచి పుతికవలస రహదారి మరమ్మతులకు గురైంది. దీంతో కుడ్డపల్లి నుంచి పెద్దకంబ, ముత్యాల జంక్షన్ నుండి కుమ్మర గండి మరమ్మతులు గురైంది .

పివీ ఈతమానగూడ నుంచి గూడంగి గల ఆరుకిలోమీటర్లు, దిగువ పుట్టిగాం నుంచి ఎగువ పొట్టిగాం వరకు 3 కిలోమీటర్లు, నడిమి డుంబంగివలస నుంచి ఎగువ డుమంది వలస వరకు మూడు కిలోమీటర్లు, రుక్మిణి గూడ రహదారి పాలకొండ మండలంలో సిరికొండ గూడ, భామిని మండలంలో ఇసుక గూడ నుంచి డోకులు గూడ కొత్త రహదారులు వేయాల్సి ఉంది. కొత్తూరు మండలం గొట్టిపల్లి పంచాయతీలో చిన్నరాజపురం రహదారి అర్ధాంతరంగా వదిలేశారు. డెప్పిగూడ నుంచి దిగువ ముల్లుగూడ రోడ్డు సగం చేసి వదిలేశారు. అడ్డంగి నుంచి అబలసింగి రోడ్డు పూర్తికాలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంతెనలు మరమ్మతులు చేయాలి

మండలంలోని పివి ఈతమనుగూడ పంచాయతీలో నాలుగు కల్వర్టులు మరమ్మతులు గురయ్యావని, వెంటనే చేయాలి. అదేవిధంగా రహదారులు కొత్తవి మంజూరు చేసి సగంలో వదిలేసిన రహదారులను పూర్తి చేయాలి,

పత్తిక వీరన్న, సర్పంచ్, పివి ఈతమానుగూడ.

పనులు కొనసాగుతున్నాయి

ఐటిడిఎ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద ఆరు రహదారులు మంజూరయ్యాయి. పాతవి రహదారులు పనులు కొనసాగుతున్నాయి.

రమాదేవి, ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ

రహదారి పనులు పూర్తి చేయకపోతే ఆందోళన తప్పదు

ఏజెన్సీలో కొన్ని గ్రామాలకు కనీస రహదారులు లేవు. మరికొన్ని రహదారులు అర్ధాంతరంగా నిలిపివేశారు. గిరిజన గ్రామాలకు వెళ్లడానికి దారి లేక ఇబ్బందులు పడుతున్నారు. రాళ్లు తేలిన రహదారిపై నడవలేక పోతున్నారు. అధికారులు స్పందించి రహదారుల నిర్మాణాలు చేపట్టకపోతే ఆందోళన తప్పదు. ఇప్పటికే అనేకమార్లు వివిధ రూపాల్లో ఆందోళనలు చేసినా ప్రయోజనం లేదు.

ఎం తిరుపతిరావు, సిపిఎం నాయకులు

సాగుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

సాగుపై విద్యార్థులకు అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

సాగులో మెలకువలు, సాంకేతిక విధానం, వ్యవసాయంలో వస్తున్న మార్పులపై విద్యార్థులకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని రస్తా కుంటుబాయి కెవికె శాస్త్రవేత్త డాక్టర్ సన్యాసి ద్రవ అన్నారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురం రాజీవ్ గాంధీ ఒకేషనల్ కళాశాల విద్యార్థులు కేవీకేని సందర్శించారు. ఈ సందర్భంగా కెవికె నుండి రైతులకు అందిస్తున్న సేవలు గూర్చి విద్యార్థులకు వివరించారు. అనంతరం అక్కడ ఉన్నటువంటి వర్మి కంపోస్ట్, పౌల్ట్రీ, చిరుధాన్యాలు డెమో యూనిట్లను చూపించి వాటి గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు అనంత విహారి, అనుజి కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టరేట్ పట్టాలను అందుకుంటున్న కృష్ణమూర్తి

హెచ్‌సి కృష్ణమూర్తికి డాక్టరేట్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్, వృద్ధ మిత్ర కోఆర్డినేటర్ కె. కృష్ణమూర్తి గత 10 ఏళ్లుగా పేద ప్రజలకు, వృద్ధులు, వికలాగులు, వితంతువులు, విద్యార్థులకు అందిస్తున్న సహాయ, సేవలకు మెచ్చి డే స్ప్రింగ్ టెక్నాలజీ యూనివర్సిటీ (టెక్సాస్,అమెరికా) ఈ నెల 4న హైదరాబాద్‌లో డాక్టరేట్ ప్రధానం చేసి సత్కరించారు. ఈ ప్రధానోత్సవంలో ఆ సంస్థ చైర్మన్, డైరెక్టర్ ఎం.వి. ప్రసాద్, డాక్టర్ అబ్దుల్ రెహమాన్, కౌన్సిలర్ తదితరులు పాల్గొని మాట్లాడారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ గత పదిహేళ్లుగా అన్ని వర్గాల వారికి సహాయం చేయడం అభినందించదగిన విషయమన్నారుఎ. కృష్ణమూర్తిని పోలీస్ శాఖతోపాటు ఇతర స్వచ్ఛంద సంస్థలు, ఆదర్శంగా తీసుకుని సమాజంలో ఉన్న ఎందరో అభాగ్యులకు ఎంతో కొంత సహాయ పడాలని కోరారు.

పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

ఘనంగా నాగుల చవితి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని 30 వార్డులలో ఉన్న స్థానిక ప్రజలు నాగులు చవితిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారి నుంచే కుటుంబ సభ్యులతో కలిసి పట్టణ శివారులో పంట పొలాలలో, ఖాళీ స్థలాలలో ఉన్న పుట్టల దగ్గరకు చేరుకొని నాగేంద్రుని పుట్టలలో పాలు, గుడ్లు, నూపప్పు ఉండలు, చలిమిడి ఉండలు, వేసి పూజలు చేశారు. నాగు పాము ప్రతిమలలు కుటుంబ సభ్యులతో కలిసి పుట్టలో నాగేంద్రునితో పాటు పూర్వీకులకు వేస్తూ కుటుంబం మొత్తం ఆయురారోగ్యంగా ఉండాలని పిల్లా, పాపలతో మొక్కులు తీర్చుకునీ, మతాబు సామాను కాల్చారు.

సీతానగరం: మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం నాగుల చవితి పండుగను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాలలో ఉన్న కల్లాలు, పొలాలలో వద్ద పుట్ట చేసుకుని పాలు, గుడ్లు, నూముద్దలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చాకలి గూడలో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని కడగండి సచివాలయం పరిధిలో ఉన్న చాకలి గూడలో మంగళవారం పోలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడి రత్నకుమారి మాట్లాడుతూ చిరుధాన్యాలను సాగు పంటలను ప్రోత్సహించాలన్నారు. రైతుల కూడా ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. వ్యవసాయ అధికారి పి శ్రీదేవి వరిలో సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. వివిధ పంటలపై సస్యరక్షణ గురించి వివరించారు. రబీ పంటలు అవసరమైన విత్తనాలు కావాలంటే రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. అర్జల్ వేసిన పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. తెగుళ్లు వచ్చినప్పుడు ఎలా ఎదుర్కోవాలో రైతులకు అవగాహన కల్పించారు. హార్టికల్చర్ అధికారి జయశ్రీ మాట్లాడుతూ రబీలో జీడి పంట బీమా గురించి వివరించారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుమ్మ, మొండెంఖల్, పెద్ద గొత్తిలి, అర్. కె. బాయి గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆధార్ కార్డులో పేర్లు తప్పుపడినా, చిన్నప్పటి ఫోటోలు, ఫోన్ నెంబర్ లింకు, వేలిముద్రలు పడకపోయినా మార్పులు, చేర్పులు తదితర సేవలను ఆధార్ కేంద్రంలో వెళ్లి, వారి ఆధార్‌ను సరి చేసుకోవాలన్నారు. మండలంలోని ప్రజలు ఈ మూడు కేంద్రాల్లో గల ఆధార్ కేంద్రాల్లో సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆయుష్ వైద్యంపై ఆశా వర్కర్లకు శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఆయుర్వేద విధానంపై ఆశాలు అవగాహన పెంచుకోవాలని ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి.హేమాక్షి అన్నారు. మంగళవారం, డోకిసీల, పెద్ద బొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి, అక్కడి ఆశా వర్కర్లకు ఆయుష్ వైద్య విధానం పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశలకు ప్రాచీన ఆయుర్వేద వైద్య విధానం ద్వారా దీర్ఘ కాలిక, మానసిక వ్యాధులను తగ్గించవచ్చు అని, ఆహారపు అలవాట్లు జీవన విధానాలతో రుగ్మతలను ఎలా తొలగించుకోవాలి, మధుమేహంపై అవగాహన ఔషధ మొక్కల గురించి వివరణ, ప్రాణాయామం యోగ పద్ధతులను వివరించి దానికి సంబంధించిన పుస్తకాలను బ్రోచర్లను ఆశా వర్కర్లకు పంపిణీ చేశారు. ఆశా వర్కర్ల ద్వారా ప్రజలలో మరింత అవగాహన పెంచేందుకు జాతీయ ఆయుష్ కమిషన్ ఈ నిర్ణయం తీసుకుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డొకిశీల వైద్యాధికారి డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ కౌశిక్, పెదబొండపల్లి. వైద్యాధికారి డాక్టర్ అనూష ధరణి పాల్గొన్నారు.

భూదేవిని మార్చండి

ప్రజాశక్తి -పాలకొండ

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న పడాల భూదేవిని వెంటనే మార్చాలని మరోసారి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి టిడిపి నేతలు తీసుకెళ్లారు. ఇటీవలే శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రబాబును టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, అయన భార్య, మహిళా నేత కర్నేన యోగిత, ఎఎంసి మాజీ చైర్మెన్ పొడిలాపు కృష్ణమూర్తి, తంపటాపల్లి ఉప సర్పంచ్ శ్రీధర్ తదితరులు కలిసి ఈ విషయం సిఎం చంద్రబాబుకు వివరించారు. ఎన్నికల్లో వైసిపికి పని చేసి, పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపిలో అంతా తామే అంటూ ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. ఇన్‌ఛార్జి భూదేవిని కొనసాగిస్తే పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని నాయకులు సిఎంకు వివరించారు. ఇప్పటికే ఈ విషయం సిఎం , మంత్రి నారా లోకేష్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ దృష్టిలో పెట్టినట్టు నాయకులు వివరించారు.

నీరు గారిన లక్ష్యం

- కాలి బూడిదవుతున్న సంపద
- నిరుపయోగంగా పడి ఉన్న చెత్త సంపద కేంద్రాలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో గత టిడిపి ప్రభుత్వం చెత్త సంపద కేంద్రాల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. అధికారుల అలసత్వం వల్ల ప్రస్తుతం ఈ కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని వీరఘట్టంతో పాటు నడుకూరు, చిట్టిపూడివలస, విక్రంపురం, కంబర, నడిమికెల్ల, చలివేంద్రి, దశమంతపురం, సంతనర్సిపురం, రేగులపాడు, చిదిమి, పివిఆర్ పురం, ఆడారు, వండవ, బిటివాడ, కత్తుల కవిటి, నీలానగరం, కుమ్మరి గుంట, హుస్సేన్ పురం, తెట్టంగి, పనస నందివాడ, కిమ్మి, తలవరం తదితర గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాల నిర్మాణాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీల నిర్వహణకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆలోచనతో అప్పట్లో వీటిని నిర్మాణ పనులు చేపట్టేందుకు రూ. కోటీ 79,73,363తో ఉపాధి హామీ పథకం ద్వారా చెత్త సంపద కేంద్రాలు నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రచించారు. అయితే వీటిలో నిర్మాణాలు పూర్తయిన కేంద్రాలు వీరఘట్టంతో పాటు ఆడారు, బిటివాడ, దశమంతపురం, కంబర, కిమ్మి, కుమ్మరి గుంట, నీలానగరం, పనసనందివాడ, నడిమికెల్ల, నర్సిపురం, రేగులపాడు, తలవరం, తెట్టంగి, విక్రంపురం, కత్తులకవిటి గ్రామాల్లో మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా నడుకూరు, తూడి, గడగమ్మ, కొట్టు గుమ్మడ, చలివేంద్రి, హుస్సేన్ పురం, చిన్నగోరకాలనీ, కె.ఇచ్చాపురం, మూలలంక, పెద్దగదబవలస, ఎం.వెంకటాపురం, యు.వెంకంపేట, పివిఆర్ పురం, చిదిమి, ఎం.రాజపురం, వండవ తదితర గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఎం.రాజపురం, పివిఆర్ పురం, చిదిమి గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు ఫిల్లర్లకే పరిమితమయ్యాయి.

చిదిమిలో ఫిల్లర్ల కే పరిమితమైన చెత్త సంపద కేంద్రం

బూడిదవుతున్న చెత్త సంపద

గ్రామాల్లో సేకరించిన చెత్తను క్లాప్ మిత్రలు నేరుగా సంపద కేంద్రానికి తరలిస్తారు. అక్కడ షెడ్ మిత్రలు తడి, పొడి చెత్తను వేరుచేసి సంపదను సృష్టించి వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీలకు సమకూర్చాల్సి ఉంది. అయితే ఆ దిశగా చర్యలు ఎక్కడా లేకపోవడంతో క్లాప్ మిత్రలు చెత్తను ఒక చోట వేసి కాల్చి వేస్తున్నారు. దీంతో చెత్త నుంచి వచ్చే సంపద కాలి బూడిదవుతుంది. చెత్తను సేకరించే క్లాప్ మిత్రలకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ప్రతినెలా రూ.6వేలు చెల్లిస్తున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. అయితే చెత్త నుంచి సంపద సృష్టించాల్సిన ఆదాయాన్ని ఇలా కాలి బూడిద అయిపోవడంతో పంచాయతీలకు రావాల్సిన ఆదాయానికి గండిపడి ప్రభుత్వ ఆశయానికి గండి కొట్టినట్లవుతుందని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సేకరించి చెత్తను కాల్చి వేయకుండా సంపదను సృష్టిస్తే ఎంతో బాగుంటుందని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపిడిఒ బి.వెంకటరమణ వద్ద ప్రజాశక్తి ప్రస్తావించిగా, చెత్త సంపద కేంద్రాలను నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులతో ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన వివరణ ఇచ్చారు.

చెత్త సంపదన కేంద్రం లేకపోవడంతో కాలి బూడిదవుతున్న చెత్త

మాతా,శిశు ఆరోగ్య శ్రేయస్సే ధ్యేయం

ప్రజాశక్తి - సీతానగరం

గర్భిణీ, బాలింత, శిశువుల్లో ప్రమాద సంకేతాలు గుర్తించి మాతా, శిశు ఆరోగ్యమే ధ్యేయంగా కషి చేయాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. గర్భిణీ నమోదైనప్పటి నుండి ప్రసవం పూర్తయ్యే వరకు నిశితమైన ఆరోగ్య పర్యవేక్షణ తప్పనిసరి అని అలాగే త్వరితగతిన గర్భిణీ నమోదు చేపట్టాలని అన్నారు. కావున హైరిస్క్ సమస్యలను సత్వరమే గుర్తించి వైద్య పరీక్షలు జరిపి ప్రమాదస్థాయికి చేరకుండా ముందస్తు జాగ్రత్త పడాలని సూచించారు. గర్భిణీ, ప్రసవ సమయంలో ప్రసవానంతరం ఏవైనా ప్రమాద సంకేతాలు గుర్తిస్తే రక్తపోటు, పిండం హృదయ స్పందన, గర్భాశయ ముఖ ద్వారం నుండి స్రావం, కాన్పు నొప్పులు అధికంగా ఎక్కువ సమయం ఉండటం, మూత్ర విసర్జన సమయంలో మంటగా ఉండటం, జ్వరం తదితర అంశాలను పరిశీలించాలని అన్నారు. బిడ్డకు పుట్టిన 24 గంటల్లోపే టీకాలు వేయించాలన్నారు. ఆశాలు, వైద్య సిబ్బంది తరచుగా గర్భిణి, బాలింతల గృహ సందర్శనలు చేస్తూ ఐరన్, కాల్షియం మాత్రలు, పౌష్టికాహారం తీసుకోవడం, శిశువుల్లో శ్వాస సమస్యలు ఉన్నాయా అని గుర్తించడం, తల్లిపాలు పట్టే విధానంపై అవగాహన కల్పించడం, ఇంకా ఏవైనా ఆరోగ్య సమస్యలుంటే గుర్తించడం చేస్తూ గర్భిణీ, బాలింత, శిశువుల ఆరోగ్య నివేదికలను ఎప్పటికపుడు విశ్లేషిస్తూ అసాధారణ నివేదికలు, సంకేతాలను గుర్తిస్తే తక్షణమే తగు వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పిహెచ్‌సిలో ప్రసవాల సంఖ్య మెరుగుపడాలన్నారు. దీర్ఘకాలిక రోగులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేస్తూ వారి ఆరోగ్యం ఏ మేరకు మెరుగు పడుతున్నదోనని గమనించాలని ఆయన సూచించారు. వైద్య, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో మాతా, శిశు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఈఓ సూర్యనారాయణ, సూపర్వైజర్ వరలక్ష్మి, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - భామిని

గ్రామాలలో ఆశా కార్యకర్తలు గర్భిణులు, చిన్నపిల్లలు ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా వైద్యాధికారి కె.విజయ పార్వతి అన్నారు. భామిని ప్రాథమిక వైద్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశ డే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం శీతాకాల సమయంలో చిన్నపిల్లలకు వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని, గర్భిణుల ఆరోగ్యంపై, రక్తహీనత రాకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కలిగించారు. ప్రతి నెల క్రమం తప్పకుండా గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించాలని, గ్రామాలలో శీతాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపిహెచ్‌ఎన్ఒ ఉషారాణి, డిపిఒ లీలారాణి, వైద్యులు సంతోషలక్ష్మి, దామోదర్ రావు, సిహెచ్ఒ భాస్కరరావు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అప్పారావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం: గ్రామాల్లో గర్భిణులను గుర్తించి వారికి సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు పడేవిధంగా చూడాలని వైద్యాధికారి పి ఉమామహేశ్వరి ఆశ కార్యకర్తలను ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. తరచుగా గ్రామాలు సందర్శించాలన్నారు. ఎప్పటికప్పుడు గర్భిణులను వైద్య తనిఖీలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకురావాలన్నారు. అంగన్వాడి కేంద్రం ద్వారా పౌష్టికాహారం సక్రంగా అందే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో సూపర్ వైజర్ శాంత కుమారి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరాయి పంచనే సమావేశం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశాలు పెట్టుకునేందుకు ఇరుకుగా ఉన్నందున సమీపంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఆశా కార్యకర్తలు, సెక్టర్ మీటింగ్ సమావేశాలు వసతి గృహంలోనే నిర్వహించవలసిన పరిస్థితి ఏర్పడుతుందని వైద్య సిబ్బంది అంటున్నారు. ఉన్న ఆస్పత్రి నిర్మించేందుకు అప్పట్లో ఏర్పాటు చేసిన భవనంలో సమావేశంలో పెడదామన్నా అది పూర్తిగా శిథిలా వ్యవస్థకు చేరుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తాదని భయంతో పరాయి పంచన సమావేశ పెట్టవలసిన పరిస్థితి ఏర్పడుతుందని వైద్య సిబ్బంది అంటున్నారు.

నైమిశాను అభినందిస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

జాతీయ క్రీడలకు పూతికవలస విద్యార్థి

ప్రజాశక్తి -సీతంపేట

మండలంలోని పూతికవలస గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎస్.నైమిశా జాతీయ క్రీడలకు ఎంపిక కావడంతో ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, డిడి అన్న దొర అభినందించారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరుగు జాతీయ స్థాయి క్రీడలకు షాట్ పుట్‌లో నైమిశా జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. వీరికి పిఒ, డిడి, డిప్యూటీ డిఒ నారాయడు స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ జాకబ్ దయానంద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.శారద, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మి సిబ్బంది అభినందించారు.

సైబర్ క్రైంపై యువత అప్రమత్తం

ప్రజాశక్తి - కురుపాం

సైబర్ క్రైం నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని నీలకంఠాపురం ఎస్సై నీలకంఠరావు అన్నారు. మంగళవారం మండలంలోని గుంజరాడలో యువతకు సైబర్ క్రైమ్, రోడ్ ప్రమాదాలు, మత్తు పదార్థాలుకు బానిసవడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్కరికీ మొబైల్ ఫోన్ అనేది వాడకంలో భాగమైందని, దీనివల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయని అన్నారు. వీలైనంతగా వాటికి దూరంగా ఉండి ఆన్లైన్లో మోసాలకు బలి కావొద్దన్నారు. అలాగే యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా మంచి చదువులు చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో యువత, పెద్దలు పాల్గొన్నారు.

వే బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకొస్తాం : డిసిఎం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - వీరఘట్టం

జిల్లాలోని వీరఘట్టం మండలం మార్కెట్ యార్డులో ఉన్న వే బ్రిడ్జిని తక్షణమే వినియోగంలోకి తీసుకురానున్నట్లు జిల్లా పౌర సరఫరాల మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన వృథాగా పడి ఉన్న వే బ్రిడ్జి వార్తకు ఆయన స్పందించారు. ప్రస్తుతం వర్షాకాలం వల్ల వే బ్రిడ్జి చుట్టూ తుప్పలు పెరిగాయన్నారు. 2024-25లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభమైనందున వెంటనే ఆ తుప్పలు తొలగించి రైతుల ధాన్యం తూనికల కొరకు వినియోగించనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

వారి తప్పేమీ లేదు : ఎంఇఒ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని అరసాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల, ఎంపిపి పాఠశాల మధ్యాహ్న భోజన కార్మికులు, స్వీపర్ ఏ తప్పూ చేయలేదని, టిడిపి నాయకుల ఒత్తిడి మేరకు తాను ఆఫైల్‌పై సంతకం చేయాల్సి వచ్చిందని మండల విద్యాశాఖ అధికారి 2 కె.శ్రీనివాసరావు అన్నారు. నారన్నాయుడు వలస గల పాఠశాలకు ప్రత్యేక అధికారిగా ఉన్నానని, తాను విధి నిర్వహణలో ఉన్నానని చెప్పినా, మీరు ఆఫీసుకు వస్తారా లేదా మమ్మల్ని రమ్మంటారా అని టిడిపి నాయకులు, ఎస్ఎంసి చైర్మన్లు తనను బెదిరించి బలవంతంగా ఎండిఎం కార్మికుల తొలగింపు ఫైల్‌పై సంతకాలు చేయించారని ఆవేదన చెందారు. తాను ఏడేళ్లగా ఎంఇఒగా విధులు నిర్వహిస్తున్నానని, ఏనాడూ వారు తప్పు చేయలేదనీ, వారిపై ఆ గ్రామం నుంచి ఫిర్యాదులు రాలేదని ప్రజాశక్తికి తెలిపారు. పైగా ఆ ఫైల్ పై సర్పంచ్ సంతకం కూడా లేదని చెప్పినా తనపై ఒత్తిడి చేశారని అన్నారు. ఈ విషయంపై సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు స్పందిస్తూ ఎంఇఒను బెదిరించి సంతకాలు చేయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక టిడిపి నాయకులు పాఠశాలల్లోకి చొరబడి అక్కడ వంట వండుతున్న మహిళలపై నోరు పారేసుకొని అసభ్య కరంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

చిరుద్యోగుల తొలగింపు సరికాదు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో వివిధ శాఖలకు చెందిన చిరుద్యోగుల తొలగింపు చర్యలు సరికాదని జాతీయ మానవ హక్కుల కమిటీ, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు అన్నారు. మంగళవారం ఆయన పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి జిల్లాలో వివిధ శాఖలకు చెందిన అధికార పార్టీ నాయకులు చిరుద్యోగులను తొలగించటం అన్యాయమన్నారు. వచ్చే కొద్దిపాటి జీవితంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న చిరుద్యోగులను తొలగించడంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు గ్రహించాలన్నారు. కొంతమంది చోటామోటా నాయకుల ఒత్తిడికి తలొగ్గి ఆయా శాఖలకు చెందిన చిరు ఉద్యోగులను తొలగించడం సబబు కాదన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ ఈ విషయంపై దృష్టి సారించాలని, లేకుంటే న్యాయ పోరాటానికి వెళ్తామని అధికారులను హెచ్చరిం చారు.

కొనుగోలు కేంద్రాలు తెరిచేదెప్పుడు?

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పలు గ్రామాల్లో వరి చేను కోతలు ప్రారంభమై, నూర్పులు కూడా పూర్తవుతున్నా ఎక్కడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యాలు తయారైనప్పటికీ ఎక్కడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో లైన్ వ్యాపారస్తులకు రైతులు అతి తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అంతేకాకుండా వర్షాభావ ప్రభావంతో ఇప్పటికే కొంత నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు

నాగభరణం సమర్పణ

ప్రజాశక్తి -పాలకొండ

పట్టణంలోని జగన్నాథ స్వామి ఆలయ ప్రాంగణంలో గల భీమలింగేశ్వర స్వామి వారి దేవస్థానానికి పాలకొండకు చెందిన వేమకోటి వెంకటరామ శర్మ జ్ఞాపకార్థం వారి కుమారులు వేమకోటి మణిల్ కుమార్ శర్మ (శ్రీ కోటదుర్గ అమ్మవారి దేవస్థానం అర్చకులు), వేమకోటి శ్రీనివాస్ శర్మ, వేమకోటి హరీష్ కుమార్ శర్మ మంగళవారం స్వామి వారికి సుమారు రూ.30వేలు విలువ కలిగిన నాగభరణం దేవస్థానానికి సమర్పించారు. కార్యక్రమంలో దేవాలయ అర్చకులు గాశీ దాసు, ఇతర భక్తులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిని అందజేస్తున్న గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాల ఉపాధ్యాయులు

డిఎస్‌సి నుంచి మినహాయించాలి

మంత్రికి గిరిజనసంక్షేమ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల వినతి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఐటిడిఎ పరిధిలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను 2014 డిఎస్‌సి నుంచి మినహాయించాలని కోరుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మంగళవారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయ పోస్టులను డిఎస్‌సి నుంచి మినహాయించాలన్నారు. గత కొన్నేళ్లుగా గిరిజన విద్యార్థులకు సంక్షేమ పాఠశాలలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నామని, గత ప్రభుత్వం 2014 ముందున్న అందరినీ రెగ్యులర్ చేసి టిడిపి హయాంలో నియమింపబడిన కొందరిని రెగ్యులర్ చేయకుండా నిలిపివేసిందని అన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి డిఎస్‌సి నుంచి తమ పోస్టులను మినహాయించి రెగ్యులర్ చేయాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1200 మంది కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్నామని, చాలిచాలని జీతాలతో పనిచేస్తున్న తమలాంటి గిరిజనులకు, తమ బాధలు తెలిసిన ఈ ప్రాంతానికి చెందిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉండడం తమకు న్యాయం చేయాలని కోరుతున్నామని తెలిపారు. దీనికి సమాధానంగా పై విషయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టిలో పెడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఆర్‌టియు యూనియన్ నాయకులు కె.చంద్రశేఖర్, కె.బాలరాజు, అప్పికొండ, గణపతిరావు పాల్గొన్నారు.

ముగిసిన జాబ్ డ్రైవ్

ప్రజాశక్తి -పాలకొండ

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళ వారం ఉదయం 9 గంటల నుండి కళాశాల జవహర్ నాలెడ్జ్ కేంద్రం ఆధ్వర్యంలో అంజనాస్ ఫౌండేషన్ సహకారంతో జాబ్ డ్రైవ్ ఘనంగా ముగిసినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.జయమణి తెలిపారు. ఈ జాబ్ డ్రైవ్‌లో ఫాక్స్ కాన్, ప్రీమియర్ ఎనర్జీస్, టాటా ఎలక్ట్రానిక్స్, స్పైడర్ ఎలక్ట్రిక్ పాల్గొన్నట్లు తెలిపారు. ఈ జాబ్ డ్రైవ్‌నకు వివిధ అర్హతలు కలిగిన 68మంది అభ్యర్థులు హాజరు కాగా, 51 మంది అభ్యర్థులు ఈ జాబ్ డ్రైవ్‌లో ఎంపికైనట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.జయమణి తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఎంపికైన 51 మంది నిరుద్యోగ యువతీ యువకులను వైస్ ప్రిన్సిపల్ బి.జయమణి, ఇతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

అండర్-14 విజేతలకు పతకాలు అందజేస్తున్న డిఇఒ తిరుపతినాయుడు

ముగిసిన రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగంపేట అంబేద్కర్ గురుకుల పాఠశాల ఆవరణలో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలు మంగళవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా డిఇఒ ఎన్ తిరుపతి నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ప్రధానంగా ఆడపిల్లలు ఈ విలువిద్య పోటీల్లో రాణించడం ఎంతో గర్వకారణమన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి బాల బాలికలు 821 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. అండర్ -14లో 12 మంది బాలికలు, 12 మంది బాలురు, అండర్ -17లో 12 మంది బాలికలు 12 మంది బాలురు, అండర్-19లో 12 మంది బాలికలు, 12 మంది బాలురు విజేతలుగా నిలిచారని తెలిపారు. ఈ విజేతలంతా గుజరాత్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని స్కూల్ గేమ్స్ రాష్ట్ర పరిశీలకులు రాధాకృష్ణ తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానంచ ఏశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం. మురళీకృష్ణ, డిప్యూటీ డిఇఒ రాజకుమార్, సీతానగరం పార్వతీపురం ఎంఇఒలు జి సూర్యదేముడు, ప్రసాద్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు డిటి గాంధీ, ఎం శ్రీనివాసరావు, బి వైకుంఠరావు, కె నాగమణి, కే తిరుపతిరావు, ప్రిన్సిపాల్ జివిఎస్ మధుబాబు, వివిధ జిల్లాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

నాటు సారా, మద్యం బాటిళ్లు అమ్ముతున్న ఇద్దరు వ్యక్తు లను అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ కె.సురేష్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమరాడ మండలం విక్రంపురంలో దాడులు నిర్వహించగా, గంటా శివకుమార్ నుంచి 25 నాటు సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్టు తెలిపారు. అలాగే పాత బస్టాండ్ వద్ద నవీన్‌ను 24 మద్యం సీసాలతో అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నాటుసారాతో పాటు అక్రమంగా మద్యం బాటిళ్లను రవాణా చేసినా, నిల్వ ఉంచినా, అమ్మకాలు సాగించినా ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాటుసారాతో పట్టుబడిన వ్యక్తి అరెస్టు

జియ్యమ్మవలస : మండలంలోని ఇటుక సమీపాన మంగళవారం బిడ్డికి కాసిందొర 20 లీటర్ల నాటు సారాను తయారుచేసి తానే అమ్మడానికి తీసుకువస్తుండగా ఎస్సై ఎన్.ప్రశాంత్ పట్టుకున్నారు. ఆయనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.